www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 3 జులై 2024
5
ఏలూరు

పాఠశాలల్లో డిఇఒ తనిఖీలు

ఏలూరు స్పోర్ట్స్ : కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశుభ్రతపై ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం తెలిపారు. ఏలూరు నగరంలోని తంగళ్లమూడి ప్రాంతంలో ఉన్న సూర్య ప్రయివేట్ పాఠశాలలో, తంగెళ్లమూడి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో మరుగుదొడ్లను, తాగునీటి సదుపాయాలను, ఆట స్థలాలను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులు ఎంతమంది చేరారో రికార్డులు తనిఖీ చేశామని తెలిపారు. విద్యార్థులు ఏ రోజు పాఠశాలకు హాజరు కాకపోయినా వెంటనే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి వివ రాలు తెలుసుకోవాలని ఆయన సూచించారు. వర్షాకాలంలో అతిసారం ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున ఉపాధ్యా యులు పాఠశాలల పరిసరాలను ఎప్పటిక ప్పుడు శుభ్రంగా ఉంచేందుకు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి శుభ్రంగా ఉండేలా చూసుకునేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

అయ్యో.. పెద్దాసుపత్రి..!

ఏలూరు సర్వజన ఆసుపత్రి

- సర్వజన ఆసుపత్రిగా మారాక పరిస్థితి అధ్వానం
- ఎంఆర్ఐ స్కానింగ్‌కు 15 రోజులపైనే ఎదురుచూడాల్సిందే
- ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న పేదలు
- సరైన వైద్యం అందక రోగుల అవస్థలు
- ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి తీరుపై వైద్య సిబ్బందిలో తీవ్ర అసంతృప్తి
- ఏసిలు వంటి పనుల నిమిత్తం ఖర్చుచేసిన సొమ్ములపై ఆరోపణలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి తీరు తయారైంది'. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు ఎనలేని సేవలందించిన ఆసుపత్రిలో ఇప్పుడు సరైన వైద్యం అందడంలేదంటూ రోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది. మెడికల్ కాలేజీ వచ్చిందన్న ఆనందం జిల్లా ప్రజలకు లేకుండా పోయిందన్న ఆవేదన అందరిలోనూ నెలకొంది. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది రోగులు వైద్యం కోసం ఏలూరు వస్తుండేవారు. ఇన్‌పేషెంట్ బెడ్స్ సైతం 450 వరకూ ఉన్నాయి. కరోనా సమయంలోనూ జిల్లా ఆసుపత్రిలో అందించిన సేవల గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతోంది. మెడికల్ కాలేజీ రావడంతో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా మారిన తర్వాత వైద్య సేవలు మరింత పెరుగుతాయని అంతా ఆశించారు. అయితే ఆ పరిస్థితి లేకుండా పోయిందన్న ఆవేదన అందరిలోనూ నెలకొంది. మెడికల్ కాలేజీగా మార్పుచేయడంతో అప్పటివరకూ పనిచేసే సీనియర్ వైద్యులను ఇక్కడి నుంచి బదిలీ చేశారు. కొత్తవారిని తీసుకొచ్చి నియమించారు. దీంతో సరైన వైద్యం అందడంలేదన్న అసంతృప్తి రోగుల్లో నెలకొంది. గతంలో రోగులు వైద్యునితో పరీక్ష చేయించుకున్న తర్వాత ఎంఆర్ఐ, సిటీస్కాన్ వంటివి సూచిస్తే అదేరోజు చేయించుకుని వెళ్లేవారు. ఇప్పుడు అ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం వైద్యులు ఎంఆర్ఐ స్కానింగ్ రాస్తే కనీసం 15 రోజుల దాటిన తర్వాత చేస్తున్నారు. ఇన్నిరోజులు స్కానింగ్ చేయకపోతే రోగి పరిస్థితి ఏంటో అధికారులే చెప్పాల్సి ఉంది. దీంతో రోగం ముదిరిపోతుందన్న భయంతో పేదలు సైతం ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. రోగులకు ఎంఆర్ఐ వంటి సేవలను అందుబాటులో లేకుండా చేసే కుట్ర కొనసాగుతోందన్న చర్చ సాగుతోంది. సర్వజన ఆసుపత్రిగా మారిన తర్వాత సీనియర్ వైద్యులను బదిలీ చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవ్వడంతో అప్పటి జిల్లా కలెక్టర్, మాజీ ఆరోగ్యశాఖా మంత్రి ఆళ్లనాని వంటి వారు ప్రత్యేక చర్యలు తీసుకుని కొంతమంది సీనియర్ వైద్యుల బదిలీ ఉత్తర్వులను నిలుపుదల చేశారు. సర్వజన ఆసుత్రిగా మారిన తర్వాత సైతం ఇక్కడ సీనియర్ వైద్యులే ప్రధాన ఆధారంగా ఉన్న పరిస్థితి కనిపిస్తోంది. మంచి సేవలు అందిస్తున్న సీనియర్ వైద్యులను సైతం ఇక్కడి నుంచి పంపించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నా తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రోగులకు వైద్య సేవలు అందించేందుకు సీనియర్ వైద్యులను మరింత మెరుగ్గా ఉపయోగించుకోవాల్సి ఉన్నప్పటికీ అది జరగడం లేదు. ఆకస్మికంగా ఆసుపత్రిలో పనిచేస్తున్న ఐదుగురు సీనియర్ వైద్యులను రిలీవ్ చేస్తున్నట్లు ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి ఉత్వర్వులు ఇవ్వడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయితే పైస్థాయిలో ఈ నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తమవ్వడంతో ఆ ఉత్వర్వులను నిలుపుదల చేసినట్లు తెలిసింది. సీనియర్ వైద్యులపై ఎందుకింత కక్ష్య సాధింపులకు దిగుతున్నారో అన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి మాటతీరు గానీ, వైద్యులు, సిబ్బంది పట్ల ఏమాత్రమూ గౌరవం లేకుండా మాట్లాడం వంటి అనేక విషయాలపై అక్కడ పనిచేసే వైద్య, ఇతర సిబ్బందిలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఆసుపత్రిని గాడిలో పెడతామంటూ మాటలు చెప్పే అధికారులు ఆసుపత్రి పరిస్థితిని మరింత దిగజారుస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చేసిన పనులపైన ఆరోపణలు..?

ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇటీవల కాలంలో ఏసిలు మార్చడం వంటి అనేక పనులు జరిగాయి. ఇందుకోసం దాదాపు రూ.మూడు కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. ఈ పనుల్లో తీవ్ర అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పనులకు సంబంధించిన ఖర్చులు, చేసిన పనులపై విచారణ నిర్వహిస్తే వాస్తవాలు బయటికొస్తాయన్న చర్చ జరుగుతోంది. ఆసుపత్రి అభివృద్ధి కోసం ఇటీవల ఎన్ని నిధులు ఖర్చు పెట్టారు. ఆ నిధులు ఏయే పనులకు ఉపయోగించారు. ఏమైనా అవకతవకాలు జరిగాయా వంటి విషయాలను జిల్లా ఉన్నతాధికారులు నిగ్గుతేల్చాలని అంతా కోరుతున్నారు. సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలు మరింతగా అందేలా జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

పట్టిసీమ ప్రాజెక్టు

ఇక 'పట్టిసీమ'పరవళ్లు..!

నేడు కృష్ణా డెల్టాకు పట్టిసీమ నీరు విడుదల

గత ప్రభుత్వం పట్టిసీమను పట్టించుకోని పరిస్థితి

టిడిపి ప్రభుత్వం రావడంతో మళ్లీ నీటి విడుదలకు సన్నాహాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పట్టిసీమ ఎత్తిపోతల పథకం మళ్లీ పరవళ్లు తొక్కనుంది. కృష్ణా డెల్టాలోని ఖరీఫ్ ఆయుకట్టుకు సాగునీరు విడుదలకు ప్రభుత్వం సిద్ధమైంది. బుధవారం ఉదయం 7.27 గంటలకు పట్టిసీమ నుంచి సాగునీటిని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విడుదల చేయనున్నారు. గోదావరి నుంచి ఏటా 3 వేల టిఎంసిలు నీరు వృథాగా పోవడంతో, పోలవరం నిర్మాణం పూర్తయ్యే వరకూ వరద నీటిని ఉపయోగించుకునేందుకు పట్టిసీమ నిర్మాణం చేపట్టారు. 2014లో టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2015లో కృష్ణా జిల్లాలోని దాదాపు 13 లక్షల ఎకరాలకు ఖరీఫ్‌లో సాగునీరు అందించాలని గోదావరి గట్టుపై పట్టిసీమ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఏడాది కాలంలోనే దాదాపు రూ.1300 కోట్లతో ఈ ప్రాజెక్టును టిడిపి ప్రభుత్వం అప్పట్లో పూర్తిచేసింది. టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం ఏటా దాదాపు 80 టిఎంసిల వరకూ పట్టిసీమ ద్వారా నీటిని తరలించిన పరిస్థితి ఉంది. మొత్తం 24 పంపులతో పంప్‌హౌస్ ఏర్పాటు చేస్తూ ఈ ప్రాజెక్టును నిర్మించారు. ఈ పంపుల ద్వారా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కుడి కాలువలోకి నీటిని ఎత్తిపోసేవిధంగా ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. ఒక్కో పంపు నుంచి 354 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే విధంగా రూపొందించారు. మొత్తం 8,500 క్యూసెక్కుల నీటిని తోడేవిధంగా ఈప్రాజెక్టును నిర్మాణం చేశారు. గోదావరిలో కనీస నీటిమట్టం ప్లస్ 14 మీటర్లు ఉన్నప్పుడు మాత్రమే నీటిని తోడేవిధంగా ఈ ప్రాజెక్టును నిర్మించారు. టిడిపి ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు నుంచి నీటి తోడకం పెద్దఎత్తున జరిగినప్పటికీ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలిపివేసింది. 2020, 21, 23లో నీటి అవసరం రావడంతో కొద్దిమేర మాత్రమే నీటితోడకం చేసింది. పట్టిసీమ నీటివిడుదలతో ఏలూరు జిల్లాలోని పెద్దపాడు, దెందులూరు ప్రాంతాల్లోని సాగుకు సైతం సాగునీరు అందించే అవకాశం ఉంది. గతంలో ఆ విధంగా చేసిన పరిస్థితి కొనసాగింది. తొలిరోజు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసి తర్వాత పెంపు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కృష్ణా, పశ్చిమ రైతులకు పట్టిసీమ నీరు ఉపయోగపడనుంది.

ఏలూరు : పోలవరం మండలం పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి ఈ నెల మూడో తేదీ బుధవారం ఉదయం 7.27 గంటలకు జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుతో పట్టిసీమ ఎత్తిపోతల కాలువలకు సాగు నీరు విడుదల చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి తెలిపారు. ఈ సాగు నీటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

4న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నీట్, నెట్ పరీక్ష పేపర్ల లీకేజీని నిరసిస్తూ ఈ నెల 4వ తేదీన జరిగే దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో లెనిన్ మాట్లాడుతూ నీట్ పరీక్షలో దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో, దేశ ప్రతిష్టకు భంగం కలిగేలా ఈ సంవత్సరం అవకతవకలు జరిగాయని విమర్శించారు. నీట్ పరీక్ష నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని, బాధిత విద్యార్థులు కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు మొరపెట్టుకున్నా ఎటువంటి స్పందనా లేకపోవడం దారుణమని విమర్శించారు. కేంద్ర విద్యా శాఖా మంత్రి ఎన్‌టిఎను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అయితే బాధిత విద్యార్థులకు న్యాయం చేస్తామని గానీ, నీట్ పరీక్ష మళ్లీ నిర్వహిస్తామని గానీ ప్రకటన ఇవ్వకపోవడం బాధ్యత రాహిత్యమని తెలిపారు. నీట్ పరీక్షా పత్రాల లీకులకు కారణమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని, పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని, కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నూతన విద్యా విధానం పేరిట దేశవ్యాప్తంగా పాఠశాలల మూసివేత ఆపాలని డిమాండ్ చేస్తూ అల్లూరి స్ఫూర్తితో బాధిత విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 4వ తేదీన లెఫ్ట్ విద్యార్థి సంఘాలను కలుపుకొని ఎస్ఎఫ్ఐ దేశవ్యాప్తంగా ఎల్‌కెజి టు పీజీ పాఠశాలలు, కళాశాలలు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో అన్ని విద్యాసంస్థలు, విద్యార్థులు బంద్‌కు సహకరించాలని కోరారు.

అధికారుల అలసత్వంతో..
డయేరియా కేసులు నమోదైతే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో అపారిశుధ్యం, కలుషిత నీరు కారణంగా ఎక్కడైనా డయేరియా, విషజ్వరాల కేసులు నమోదైతే సంబంధిత శాఖల అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి అధికారులను హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో శానిటేషన్, తాగునీరు, తదితర అంశాలపై జిల్లా అధికారులతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యం, తాగునీరు, దోమల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రజా సమస్యలు నమోదు కోసం ఏర్పాటు చేసిన 9491041188 నంబర్‌కు శానిటేషన్, దోమల సమస్య, తాగునీటి కలుషితంపై పలు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు పూర్తిస్థాయిలో నిర్వహించాలని, ఎక్కడా డయేరియా కేసులు నమోదు కాకుండా పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టాలని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా డయేరియా కేసులు నమోదైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానన్నారు. పట్టణ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇఒపిఆర్‌డిలు ఉదయం ఆరు గంటల నుంచే హాజరై పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. తాను పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఎక్కడైనా అధికారుల అలసత్వం కారణంగా డయేరియా కేసులు నమోదైతే వారిపై చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాలని, క్లోరినేషన్ అనంతరం తాగునీరు సరఫరా చేయాలని తెలిపారు. డ్రెయినేజీల్లో మురుగు నీరు నిల్వ లేకుండా సిల్ట్ తీసి, ప్రతిరోజూ శుభ్రం చేయించాలన్నారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా వారు పనిచేసే ప్రదేశంలోనే నివాసం ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాధ్, ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సత్యనారాయణ, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఏజెన్సీలో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏజెన్సీలో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలని, రోగులకు తక్షణం వైద్యం అందించాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా, కొత్త అధికారులు వస్తున్నా ఏజెన్సీ ప్రాంత ప్రజలు వైద్యం అందక అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వేలేరుపాడు మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన వెంకయ్య వైద్యం కోసం తీసుకొచ్చిన బాధితురాలిని జీలుగుమిల్లి పిహెచ్‌సిలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో అశ్వరావుపేటకు తరలించాల్సి వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో అందుబాటులో అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో ఆటో మాట్లాడుకుని, బాధితురాలి చేతికి పెట్టిన సెలైన్ ఒక చేత్తో పట్టుకొని ఆటోలో తీసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ ఒక్క ఘటన వల్ల ఏజెన్సీలో వైద్య సేవలు ఏ రకంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం నడుస్తుండడంతో ఏజెన్సీలో రోగాలు విపరీతంగా పెరిగే ఆస్కారం ఎక్కువగా ఉందని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వైద్య శాఖాధికారులకు ఆదేశాలిచ్చి ఏజెన్సీలోని పిహెచ్‌సి సెంటర్లు, ఆసుపత్రుల్లో సౌకర్యాలు, సిబ్బందిని మెరుగుపర్చాలని, అవసరమైన మందులు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ముసునూరులో డయేరియా కేసు

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరులో ఒక వృద్ధురాలికి డయేరియా ఉన్నట్లు వైద్యాధికారులు గుర్తించినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామంలోని రైస్ మిల్ సెంటర్ ఏరియాలో వృద్ధురాలు కొల్లి వెంకటరమణ గత నాలుగైదు రోజుల నుంచి అనారోగ్యంతో బాధ పడుతుంది. నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రిలో ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డయేరియా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముసునూరులో పరిసర ప్రాంతాలు శుభ్రం చేయించారు.

జాతీయ రహదారి విస్తరణకు కొలతలు

జీలుగుమిల్లి : మండలంలోని తాటియాకులగూడెం నుంచి పట్టిసీమ వరకు ఉన్న జాతీయ రహదారి (365బిబి) విస్తరణకు సంబంధించి ఆర్‌అండ్‌బి రహదారికి ఇరువైపుల ఉన్న ఇల్లు, దుకాణాలకు కొలతలు ప్రారంభించినట్లు ఆర్‌అండ్‌బి డిఇ సిహెచ్.హరికృష్ణ తెలిపారు. మంగళవారం తాటియాకులగూడెం నుంచి జీలుగుమిల్లి జాతీయ రహదారి వరకు ఉన్న ఇల్లు, దుకాణాలను సర్వే బృందంతో కలిసి కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణకు 70 అడుగులు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్థానిక సెంటర్‌లో రింగ్ రానున్నట్లు తెలిపారు

ఆదర్శప్రాయులు అల్లూరి సీతారామరాజు

మాజీ ఎంఎల్‌సి రాము సూర్యారావు

ప్రజాశక్తి - ఏలూరు

అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎంఎల్‌సి రాము సూర్యారావు అన్నారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వారోత్సవ కమిటీ కన్వీనర్, బహుజన ఆఫీసర్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావుతో కలిసి రాము సూర్యారావు ఏలూరు నగర పరిధిలోని వివిధ స్కూల్స్, కాలేజీలను మంగళవారం సందర్శించారు. సర్‌సిఆర్.రెడ్డి మహిళా కాలేజీ, జూనియర్ కాలేజీ, వట్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్, విద్యా వికాస్ స్కూల్, కాలేజీ, శ్రీభారతి స్కూల్, టాటా స్కూల్, కెకెఆర్ గౌతం స్కూల్ సందర్శించారు. ఆయా స్కూల్స్‌లో ప్రిన్సిపాల్స్, హెడ్ మాస్టర్లు, విద్యార్థులతో బృందం మాట్లాడింది. ఈ నెల నాలుగో తేదీన నీట్ పరీక్షల అవకతవకల మీద దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల బంద్ కారణంగా ఏలూరు నగరంలో స్కూల్స్, కాలేజీల్లో మాత్రం అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వారోత్సవ సభలు మూడు లేదా ఐదో తేదీన నిర్వహిస్తామని తెలిపారు. విద్యాలయాల్లో విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు జీవితంపై డ్రాయింగ్ పోటీలు, ఏకపాత్రాభినయం పోటీలు, వేషధారణ పోటీలు, ఉపన్యాసం పోటీలు ఏర్పాటు చేయమని కోరారు. ఏలూరులో 127 సంఘాలు చేపట్టిన వారోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్వాహక కమిటీ కన్వీనర్ దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో సమాజాన్ని ప్రజల బాధలను పరిశీలించాలని కోరారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల్లో 127 చోట్ల 3, 4, 5 తేదీల్లో సభలకు అందరూ సహకరించాలని కోరారు. అన్ని విద్యాలయాల ప్రిన్సిపల్స్, హెడ్ మాస్టర్లకు రెండు చొప్పున డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు రూపొందించిన భారత రాజ్యాంగ సంకలనం పుస్తకాలు అందించారు.

భారత రాజ్యాంగ సంకలనం పుస్తకాలు అందిస్తున్న వక్తలు

టీచ్ టూల్‌తో సమర్థవంతమైన విద్యాబోధన

ప్రజాశక్తి - భీమడోలు

ఉపాధ్యాయులు బోధనా సమయంలో టీచ్ టూల్ ప్రక్రియను అమలు చేయడం ద్వారా మరింత సమర్థవంతంగా విద్యాబోధన చేయవచ్చని సమగ్ర శిక్ష రాష్ట్ర సమన్వయకర్త మాధవిలత అన్నారు. భీమడోలు హైస్కూల్ వేదికగా ఐదు మండలాల నుంచి ఎంపిక చేసిన 52 మంది ఉపాధ్యాయులకు టీచ్ టూల్ ప్రక్రియపై శిక్షణా తరగతులు కొనసాగు తున్నాయి. రెండో రోజైన మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర సమయకర్త ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమన్వయకర్త మాట్లాడారు. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రాజెక్ట్ జిల్లా సమన్వయకర్త బి.చంద్రశేఖర్ టీచ్ టూల్ లక్ష్యాలను, ఇతర అంశాల గురించి వివరించారు. కార్యక్రమానికి డైరెక్టర్లుగా భీమడోలు మండల విద్యాధికారులు భాస్కర కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఆటోడ్రైవర్‌పై దాడికి కారకులను కఠినంగా శిక్షించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, అధ్యక్షులు సోమయ్య

బాధితుడిని పరామర్శిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, అధ్యక్షులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. గాయపడి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్‌ను వారు మంగలవారం పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో కొవ్వలి గ్రామానికి చెందిన మాత్రపు రమేష్‌పై కొంతమంది ఆటో డ్రైవర్లు దాడి చేయడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండించిందన్నారు. మాత్రపు రమేష్ కొవ్వలి గ్రామంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారని, సీరియల్ విషయంలో ఉద్దేశపూర్వకంగా వివాదాన్ని సృష్టించి ఏలూరు టౌన్ యూనియన్ ప్రోద్బలంతో దాదాపు 30 మంది దాడి చేశారని, తలకు గాయం కావడంతో ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా రెండు కుట్లు వేశారని తెలిపారు. గాయపడిన రమేష్‌ను పరామర్శించడానికి వెళ్లిన ఏలూరు జిల్లా ఆటో ట్రాలీ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపీపై నగరబోయిన లీలా కృష్ణ తన అనుచరులతో దుర్భాషలాడుతూ దాడికి దిగారన్నారు. మాత్రపు రమేష్, జె.గోపీపై దాడి చేసిన నగరబోయిన లీలా కృష్ణ, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రమేష్‌ను సిఐటియు ఏలూరు నగర నాయకులు పి.కిషోర్, వి.సాయిబాబు, ఆటో యూనియన్ నాయకులు చక్రాల అమర్‌కుమార్ పరామర్శించారు.

ఎంఎల్ఎ బాలరాజుకు వినతిపత్రం అందిస్తున్న ఫ్రాన్సిస్

హాస్టల్ తెరవాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహన్ని తెరిపించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ కోరారు. ఈ మేరకు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ వసతి గృహాన్ని మూసివేయడంతో ఆ ప్రాంతంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే జంగారెడ్డిగూడెం గురుకుల పాఠశాలలో సీట్లు శాతం పెంచాలని కోరారు. దీనిపై ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి హాస్టల్‌ను మళ్లీ ప్రారంభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

'పిఎంఎస్ఆర్ఐ'కు మండవల్లి జెడ్‌పిహెచ్ స్కూల్

ప్రజాశక్తి - మండవల్లి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రైమ్ మినిస్టర్ స్కూల్ ఆఫ్ రైసింగ్ ఇండియాకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం ఆయన మాట్లాడారు. పాఠశాలలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నారని చెప్పారు. దీంతో పిఎంఎస్ఆర్ఐ పథకానికి పాఠశాల ఎంపికైందన్నారు. ఈ పథకం కింద క్రీడా ప్రాంగణం మెరక చేసుకోవడానికి క్రీడా పరికరాల నిమిత్తం రూ.ఐదు లక్షలు మంజూరయ్యాయన్నారు. అంతేకాకుండా ఐటీ ల్యాబ్‌తో పాటు ఫిజిక్స్, కెమిస్ట్రీ, ల్యాబ్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు వచ్చాయని, నిధులు మంజూరైన అనంతరం పనులు ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేట్ డిగ్రీ కళాశాలల్లో ఆన్‌లైన్ ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ విడుదల చేసిందని, డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరదలుచుకున్న విద్యార్థులు ఈ నెల రెండో తేదీ నుంచి పదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల, కోర్స్ ఎంపికను 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఏలూరు కోటదిబ్బలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత సహాయ కేంద్రాన్ని సంప్రదించవచ్చని ప్రిన్సిపల్ తెలిపారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఏ హిస్టరీ, బికాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్‌సి జువాలజీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్, బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ కోర్సులు కలవని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారులకు వారు మంగళవారం వినతిపత్రం అందించారు. ములిశెట్టి యుగంధర్ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అక్కడున్న మెడికల్ ఆఫీసర్‌తో వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై, రక్త పరీక్ష కేంద్రాల గురించి, ఫార్మసీ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరదల సమయంలో కంటిన్యూగా గ్రామాల్లో ఉన్న ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలో తోటి మెడికల్ ఆఫీసర్ టీంగా ఉండే డ్యూటీలు చేస్తారని, ప్రతి ఒక్క మెడిసిన్ అందుబాటులో ఉంటుందని సిబ్బంది తెలిపారు. అదేవిధంగా కుక్కునూరు పిహెచ్‌సిలో కొంత సిబ్బంది లేక వైద్యం అందించలేకపోతున్నామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు యుగంధర్, ఉపాధ్యక్షులు మంత్రి గోపాలకృష్ణ, వెంకన్న బాబు, వెంకటేశ్వర్లు, మహేష్ హాస్పిటల్స్ మెడికల్ అధికారులు రమేష్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేరే ప్రాంతానికి వెళ్లి పింఛన్ అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీ వెలమపేటకు చెందిన పూడి అమ్మాజీ తన చిన్న కుమారుడు ఇంటికి వెళ్లి అక్కడ ఆరోగ్య పరిస్థితి బాగోక లేవలేని స్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ

సొంగా రోషన్‌కుమార్ సచివాలయం సిబ్బందిని ఉంగుటూరు పంపించి అమ్మాజీకి పింఛన్ అందించాలని చెప్పారు. దీంతో సుమారు వంద కిలోమీటర్లు ప్రయాణించి అమ్మాజీకి పింఛన్ అందించారు.

జంగారెడ్డిగూడెం టౌన్ : మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన వేముల సోమాలు కాలు విరిగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. లక్కవరం సచివాలయం-1 వెల్ఫేర్ అసిస్టెంట్ డి.శ్రీనివాసరావు, తన సొంత ఖర్చులతో ఏలూరు వెళ్లి, వైద్యం పొందుతున్న ఆ మహిళకు వృద్ధాప్యం పింఛన్ అందించాడు. దీంతో ఆ కుటుంబం ఆనందాన్ని వ్యక్తం చేసింది. విషయం తెలుసుకున్న పంచాయతీ మండల అధికారులు, లక్కవరం టిడిపి నాయకులు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసును అభినందించారు.

మండలంలోని చక్రదేవరపల్లి గ్రామానికి చెందిన చిగురుపల్లి పుష్ప కిడ్నీ వ్యాధితో బాధపడుడూ విజయవాడ ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. పుష్పకు పింఛన్ అందించేందుకు చక్రదేవరపల్లి గ్రామ పంచాయతీ సర్పంచి సాయల సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు స్యాల రాంబాబుల సూచన మేరకు సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ అరిగెల సూర్య విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. పుష్పకు రూ.ఏడు వేల పింఛన్ అందించారు.

వికలాంగులకు ఉచిత ఉపకరణాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం వారిచే ప్రత్యేక అవసరాలు కలిగిన వికలాంగ బాలబాలికలకు ఉచితంగా ఉపకారణాలు పంపిణీ చేశారు. ఏలూరులోని అశోక్ నగర్‌లో ఉన్న అశోక వర్ధన్ మున్సిపల్ స్కూలులో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమర్ కోటేశ్వర్ (మెడికల్ ఆఫీసర్) మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన ప్రతి పిల్లవాడు మిగిలిన పిల్లలలానే కలిసి జీవించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈ క్యాంపును విద్యా శాఖ వారు మెడికల్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి నిర్వహించారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డిఇఐసి సెంటర్లను ఏర్పాటు చేస్తుందని, ఇలాంటి పిల్లలను అక్కడ జాయిన్ చేసుకొని వారికి కావాల్సిన థెరపీలను ఎప్పటికప్పుడు అందిస్తున్నామని చెప్పారు. ఈ క్యాంపులో వికలాంగులైన బాల బాలికలకు ట్రై సైకిళ్లు, వినికిడి పరికరాలు, రో లిట్రెస్, సిపి చైర్స్, ఎంఆర్ కిట్లను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ భవిత కేంద్రాల్లో ఈ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. వికలాంగులు ఇలాంటి సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

కాలువలోకి దూకిన యువతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో ఏలూరు కాలువ వంతెన పై నుంచి కాలువలోకి గుర్తు తెలియని యువతి మంగళవారం మధ్యాహ్నం దూకేసింది. గమనించిన స్థానికులు ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన నీటి ప్రవాహం కారణంగా ఆ యువతి కొట్టుకుపోయింది. గల్లంతైన యువతి భీమవరానికి చెందిన పెచ్చెట్టి ఝాన్సీగా, తన అమ్మమ్మ ఇంటికి చేబ్రోలు వచ్చినట్లు అనుమానిస్తున్నారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ముసునూరు

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రమణక్కపేట గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ వాసు తన సిబ్బందితో మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.30 వేల నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించాలి

కలెక్టర్‌కు తూర్పుగూడెం గ్రామస్తుల ఫిర్యాదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురం పంచాయతీ పరిధిలోని తూర్పుగూడెంలో ఉన్న శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ ఏలూరు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేసినట్లు గ్రామానికి చెందిన కోటమర్తి వెంకటేశు, రాయల పీరయ్యలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టి.నరసాపురం రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 293/1 లో య 2.46 సెంట్లు శ్మశాన భూమి ఉందని, ఆ భూమిలో తూర్పుగూడెం, ఇందిరాకాలనీ ఎస్‌సిలు, గండిగూడెం గ్రామస్తులు గ్రామాల్లో చనిపోయిన వారికి దహన సంస్కారాలు, అంత్యక్రియలు చేస్తున్నామని తెలిపారు. అయితే ఈ శ్మశాన భూమిలో గండిగూడెం గ్రామానికి చెందిన కొరివి శ్రీకాంత్ గత జూన్ 26న కొబ్బరి మొక్కలు నాటి భూమిని ఆక్రమించుకున్నాడని, దీనిపై ప్రశ్నించిన తూర్పుగూడెం, ఇందిరా కాలనీ ఎస్‌సి ప్రజలను ఇబ్బంది పెడుతున్నాడని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి శ్మశాన వాటికలో స్థలానికి హద్దులు వేయించి ఆక్రమణలు తొలగించాలని, ఆక్రమణదారునిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వారం రోజుల్లో కల్వర్టు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కల్వర్టు పనులను వారం రోజుల్లో పూర్తి చేస్తామని ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్‌మోషే అన్నారు. ఇటీవల బాధిత కుటుంబాలను పరామర్శించటానికి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి మండల పరిధిలోని ఈదులగూడెం గ్రామం వచ్చినప్పుడు గ్రామంలో డిప్ సెంటర్, హైస్కూల్ సెంటర్‌ల వద్ద కల్వర్టులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని టిడిపి నాయకులు, గ్రామ ప్రముఖులు చిట్నేని శివరామకృష్ణ కోరారు. స్పందించిన మంత్రి ఈదులగూడెం గ్రామంలో కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించడంతో మంగళవారం ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్‌మోషే, ఇఇ కిశోర్ బాపూజీ, డిఇ బాబూరావు, ఎఇ అశోక్‌బాబుతో కలిసి ఆ ప్రాంతాలను పరిశీలించి వారం రోజుల్లో కల్వర్టుల నిర్మాణం చేపడతామని చెప్పారు.

50 మంది విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ హేలపూరి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సిఆర్ఆర్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులకు కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు. సిఆర్ఆర్ పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానం చేయడంలో సిఆర్ఆర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ విద్యార్థులు ముందుంటారని, ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేస్తారని చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేయాలని కోరారు.

శ్రీవారి సన్నిధిలో కలెక్టర్ దంపతులు

ప్రజాశక్తి - ఏలూరు/ ద్వారకాతిరుమల

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కుటుంబ సమేతంగా ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు కలెక్టర్ దంపతులకు వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, శాలు వా, స్వామివారి చిత్రపటాన్ని కలెక్టర్ దంపతులకు అందిం చారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - టి.నరసాపురం

అతిసార వ్యాధి పట్ల అప్రమత్తత అవసరమని కేతవరం సిహెచ్‌సి అధికారి సిహెచ్‌కె.రాజు తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం పరిధిలో మండలంలోని కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో అతిసార వ్యాధిపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వైద్యాధికారిణి కె.కల్పనారాణి ఆదేశాల మేరకు అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మూడేళ్ల నుంచి ఐదేళ్ల చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అతిసార వ్యాధి లక్షణాలు కనిపిస్తే తక్షణమే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట శివారు ఆడమిల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-2025 విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో డిగ్రీ ప్రవేశాలు పొందాలనుకునే అభ్యర్థులు ఈ నెల రెండో తేదీ నుంచి పదో తేదీ వరకు ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐదో తేదీన దరఖాస్తుల పరిశీలన, 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ నమోదు, జూలై 19వ తేదీన సీట్ల కేటాయింపు, జూలై 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. జులై 22వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

అఖిల్ మృతి బాధాకరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని శ్రీనివాస సెంటర్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం జర్నలిస్ట్ కక్కెర్ల అఖిల్‌కు పలువురు పాత్రికేయులు నివాళి అర్పించారు. నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ యువ జర్నలిస్ట్ అఖిల్ హైదరాబాదులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారన్నారు. దళిత సంఘ నాయకులు జమలయ్య అఖిల్ మృతికి సంతాపం తెలిపారు. అఖిల్ కుటుంబానికి పాత్రికేయుడు రుద్రపాటి ప్రసాద్ రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు. మరికొంత ఆర్థిక సాయం చేసేందుకు తాను ముందుకు వస్తానని ప్రసాద్ ప్రకటించారు.

సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి-నూజివీడు, ఆరేళ్ల సమీకృత బిటెక్, ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలనలో భాగంగా క్యాప్ విభాగంలో 62 మంది, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 113 మంది ద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిమిత్తం హాజరయ్యారు. బుధవారం క్యాప్, భారత్ స్కౌట్స్ అండ్ గౌడ్స్, వికలాంగులు (పిహెచ్), ఎన్‌సిసి, క్రీడ కేటగిరీలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరగనున్నట్లు ఆర్‌జియుకెటి అడ్మిషన్స్ కన్వీనర్, ఆచార్య ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు.

విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యలు సరికావు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ రంగంలో పనిచేసే కూలీలు పనులకు రావటం లేదని, అందువల్లనే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని చేసిన విష్ణుకుమార్‌రాజు అనుచిత వ్యాఖ్యలు సరికావని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం, మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం మండల అధ్యక్షురాలు యాగంటి సీత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎం.జీవరత్నం, అందుగుల ప్రభాకరరావు మాట్లాడుతూ జూన్ 29వ తేదీన విశాఖ జిల్లాలో సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ అధికారుల సమావేశంలో పాల్గొన్న బిజెపి శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్‌రాజు ఉపాధి హామీ కూలీలపై అనుచిత వ్యాఖ్యలకు చేశారన్నారు. ఈ వ్యాఖ్యలు సరికావన్నారు. విష్ణుకుమార్ రాజు వ్యవసాయ కార్మికులకు, ఉపాధి . కూలీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే రాష్ట్రంలోని ఉపాధి కూలీలందరినీ ఐక్యం చేసి మీ వైఖరిని ఎండ కడతామని, ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్రరావు, పిల్లి చంటి, బత్తుల వెంకన్న, వి.నరసింహరావు, నిట్టా నాగరాజు, కె.సుబ్బారావు, టి.రాజశేఖర్ పాల్గొన్నారు.

చింతలపూడి-టి.నరసాపురం రోడ్డుకు మరమ్మతులు చేయాలి

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌కు సామాజిక కార్యకర్త నాషార్‌పాషా వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి - టి.నరసాపురం ప్రధాన రహదారి మరమ్మతులు, విస్తరణ, చింతలపూడి మున్సిపాలిటీకి చెత్త డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని టి.నరసాపురానికి చెందిన సామాజిక కార్యకర్త ఎస్‌డి నాషార్‌పాషా కోరారు. ఈ మేరకు ఆయన చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి-టి.నరసాపురం ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో టిప్పర్ రాకపోకలతో గుంతలు ఏర్పడడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారన్నారు. రోడ్డు మరమ్మతులతో పాటు ప్రమాదాల నివారణకు, రోడ్డు విస్తరణకు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. అదేవిధంగా చింతలపూడి నుంచి తెలంగాణ సరిహద్దు గ్రామం అల్లిపల్లి రోడ్డు కూడా బాగా పాడైపోయిందని, ఈ రోడ్డు బాగు చేయించే విషయంలో కూడా చొరవ చూపాలని కోరారు. చెత్త డంపింగ్ యార్డ్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఘుమ్ షావలి, లతీఫ్ పాల్గొన్నారు.

చింతలపూడిలో వింకా హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

అధునాతన టెక్నాలజీతో ఉమెన్స్, చిల్డ్రన్స్ హాస్పిటల్ చింతలపూడిలో ప్రారంభించడం అభినందనీయమని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడిలో గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ఎదురుగా హెల్త్ ఉమెన్స్, చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార నైపుణ్యం, అనుభవం కలిగిన డాక్టర్ల బృందంతో అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మల్టీ స్పెషాలిటీ సేవలందించేందుకు వింకా హెల్త్ హాస్పిటల్ సిద్ధమవుతోందన్నారు. అన్ని సదుపాయాలతో చింతలపూడి

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

వాసులకు మరో కొత్త ఆసుపత్రి అందుబాటులోకి రాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి ప్రభుత్వం నాయకులు పాల్గొన్నారు.

పాడి పశువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు సాయి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.సాయి బుచ్చారావు తెలిపారు. ఈ సందర్భంగా పశువులను పెంచే రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలం కావడంతో పశువులు పడుకునే స్థలం పొడిగా ఉండేటట్లు చూసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా ఈ కాలంలో పశువులకు వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందని చెప్పారు. వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల పలు రకాల వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని, పశువుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఈ కాలంలో తొలకరి గడ్డి తినడం వల్ల గొంతు వాపు వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతాయన్నారు. గొంతు వాస్తుందని, జ్వరంతో పాటు కళ్లు ఎర్రబడి నీరు కారుతుందని చెప్పారు. ఇటువంటి లక్షణాలు ఉన్న పశువులకు వెంటనే చికిత్స చేయించాలన్నారు. ఇటువంటి రోగాల బారిన పడకుండా పశువులకు పశు వైద్య శిబిరాల్లో నివారణకు సంబంధించి టీకాలు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని పాడి రైతులు దగ్గర్లోని పశు వైద్య శిబిరానికి వెళ్లి ముందుగానే టీకాలు వేయించుకోవాలని సూచించారు.

కలెక్టర్ వెట్రి సెల్విని కలిసిన అప్పలనాయుడు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కలెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కె.వెట్రిసెల్విని కలెక్టర్ కార్యాలయంలో జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు జనసేన నాయకులతో కలిసి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డిఅప్పలనాయుడు మీడియాతో మాట్లాడుతూ జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ వెట్రిసెల్విని జనసేన నియోజకవర్గ నాయకుల అందరి తరపున కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. వచ్చే వర్షాకాలంలో డయారియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని కలెక్టర్‌కు వివరించామని చెప్పారు. దీనికి కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏదైనా సమస్యలుంటే చెప్పాలని సానుకూలంగా స్పందించారన్నారు. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపి భవిష్యత్తులో అనేక సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఒబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్ పాల్గొన్నారు.

దొండ పందిర్లకు రాయితీ బకాయిలు ఇవ్వాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

దొండ పందిళ్లకు ఇవ్వాల్సిన రాయితీ బకాయిలు గత ప్రభుత్వం చెల్లించలేదని, వాటి నిధులు విడుదల చేసి రైతులకు అందించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఎం.నాగులపల్లిలో ఈ నెల 10, 11 రైతు సంఘం జిల్లా స్థాయి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎం.నాగులపల్లిలో మంగళవారం నిర్వహించిన రైతు సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, ప్రభుత్వాల విధానాలు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలు తదితర అంశాలపై రైతు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొని మాట్లాడతారని చెప్పారు. జిల్లాలో అన్ని మండలాల నుంచి ఎంపిక చేసిన రైతు ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. ఎం.నాగులపల్లిలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం హాలులో జరుగుతున్న ఈ రైతు శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరారు. దొండ పందిళ్లకు ఇవ్వాల్సిన రాయితీ బకాయిలు గత ప్రభుత్వం చెల్లించలేదని, వాటి నిధులు విడుదల చేసి రైతులకు అందించాలని కోరారు. గత ఐదు సంవత్సరాలుగా దొండ పందిళ్ల రాయితీ బకాయిల కోసం రైతులు అనేక ఆందోళనలు చేశారని, అంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అమలు చేసిన ఈ పథకంలో రాయితీ బకాయిల నిధులు వైసిపి ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి దొండ పందిళ్ల రాయితీ బకాయిలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండలాధ్యక్షులు బోయపాటి సత్యనారాయణ, మండల కార్యదర్శి కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

4న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ఎఐఎస్ఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనీల్ కుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఈ నెల నాలుగో తేదీన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం అనీల్ కుమార్ పిలుపునిచ్చారు. నూజివీడు ఎఐఎస్ఎ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎన్‌టిఎ నిర్వహించిన నీట్ పేపర్ లీకేజ్‌ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల నాలుగో తేదీన విద్యాసంస్థల బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా నీట్ ఎగ్జాం రాసిన విద్యార్థులు భవిష్యత్తు ఏమిటో తెలియక ర్యాంకులు కోల్పోయి అయోమయ స్థితిలో ఉన్నారన్నారు. నాలుగో తేదీన విద్యాసంస్థల బంద్‌కు ప్రయివేట్, కార్పొరేట్ ప్రభుత్వ అన్ని రకాల విద్యా సంస్థలు స్వచ్ఛందంగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గరికే అఖిల్, నియోజకవర్గ నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీను, హుస్సేన్ పాల్గొన్నారు.

కామవరపుకోటలో 99.16 శాతం పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ 99.16 శాతం పూర్తయిందని టిడిపి మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 8211 పెన్షన్లకు గాను 8142 అందించినట్లు చెప్పారు. మిగిలిన 69 మందిలో 58 మంది చనిపోయిన వారు ఉన్నారని, మిగిలిన 11 మంది ఇతర ప్రదేశాల్లో ఉన్నారని తెలిపారు. ఒకటో తేదీ ఉదయం ఆరు గంటల నుంచి నిర్విరామంగా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయ సిబ్బందికి, మానిటరింగ్ చేసిన అధికారులకు టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి

జీలుగుమిల్లి :ప్రాజెక్టు పరిధిలో డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఐకెపి అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ఐకెపి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడటంతో ప్రాజెక్ట్ పరిధిలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. మండల పరిధిలో కూడా నూతనంగా డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. పాత బకాయిలను వసూలు చేసి నూతన రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం అడమిల్లి రామారావు, సిసిలు సురేష్, దుర్గారావు, దాసు, మండలంలోని విఒఎలు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించండి : వాలంటీర్లు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

తమకు గడిచిన మే నెల జీవం వేయలేదని, తాము ఉద్యోగానికి రాజీనామా చేయలేదని, తమకు వేతనాలు ఇప్పించాలని పరింపూడి పంచాయతీలో 22 మంది వాలంటీర్లు కోరారు. ఈ మేరకు గంగిరెడ్ల మేఘలాదేవిని కలిసి తమ గోడును విన్నవించారు. ఈ సందర్భంగా మేఘలాదేవి మాట్లాడుతూ వేతనాలు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, మండపాక గ్రామానికి చెందిన రత్న అనూష (పాస్‌పోర్టు నెంబర్: T0932883) జిరాక్స్ నిమిత్తం మండపాక నుండి తణుకు టౌన్‌కి వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్:
రత్న అనూష, W/o. శ్రీనివాస్
డోర్ నెంబర్: 3-98/2,
Near: ఎల్లారమ్మ అమ్మవారి దేవస్థానం
VTC మండపాక రూరల్, మండపాక గ్రామం
తణుకు మండలం, పశ్చిమగోదావరి జిల్లా
పిన్: 534128, సెల్: 90597 88077

పత్రికా ప్రకటన

మా క్లయింటు దంపనబోయిన శంకర్, ఏలూరు మండలం, ఏలూరు వాస్తవ్యులు మాకు ఇచ్చిన సమాచారం ప్రకారం తెలియచేయునది ఏమనగా, లేటు దంపనబోయిన వెంకట రమణరావు ది. 10-7-2016న దంపనబోయిన శంకర్ పేరున వ్రాసిన వీలునామా ప్రకారం 1 ఎకరం భూమి పాలగూడెం ఆర్.ఎస్. 362, డాక్యుమెంటు నెం. 526/1987 మరియు పత్తేబాదలోని టి.ఎస్. నెం. 47/5 & 6, డోర్ నెం. 24ఎ-28-4 ఇంటి వాటా, నాటి నుండి నేటి వరకు మా క్లయింటు హక్కు భుక్తంలో ఉన్నది. పైన పేర్కొనబడిన సదరు ఆస్తులపై ఎవరైన ఏవిధమైన అక్రమ చర్యలకు పాల్పడిన యెడల అట్టి వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనబడును.

షెడ్యూలు

1. **తూర్పు:** పంట బోది. **పడమర:** ఆంజనేయస్వామి వారి భూమి. **దక్షిణం:** డి.శంకర్. **ఉత్తరం:** జంగా రామయ్య గారి భూమి.
2. **తూర్పు:** రోడ్డు. **పడమర:** శంకర్. **దక్షిణం:** లేటు బాలభాస్కర్, **ఉత్తరం:** రోడ్డు.

ఎన్.అమరనాధం
అడ్వకేటు, ఏలూరు

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 168/2023

Between:
మద్దింశెట్టి బలరాముడు **-వాది**
మరియు
అడ్డాల సత్యనారాయణ (died) వగైరా **-ప్రతివాదులు**

D-4: అడ్డాల శివ, S/o. సత్యనారాయణ, డో.నెం. 3-53 & 3-53/1, చాకలివారి పేట, గుమ్ములూరు

పై నెంబరు దావాలో ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని నోటీసులు పంపించినప్పటికి మీరు ఉద్దేశ్యపూర్వకముగా సమన్లు అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపర్ ద్వారా మీకు నోటీసు జారీ చేసియున్నారు. దావా **ది. 25-7-2024వ తేదీనకు వాయిదా అయివున్నది.** కావున మీరు వ్యక్తిగతంగా గాని లేదా మీ పరోక్షమున ప్లీడరు గారి ద్వారా గాని కోర్టులో హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. సదరు వాయిదాకు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున దావా గ్రంథము జరుపబడునని తెలియచేయడమైనది.

(By Order)
పి.డి.యస్.వి.బాలాజి
న్యాయవాది, పాలకొల్లు
తేదీ.28-06-2024 సెల్: 94904 33732

మహారాజశ్రీ ఏలూరు మొదటి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. No. 1/2023 in
O.S. No. 311/2018

Between:
మల్లవరపు రామలింగేశ్వరరావు **-పిటీషనరు/వాది**
మరియు
నెక్కలపు సరోజిని (died) మరియు వగైరాలు
-రెస్పాండెంటు/ ప్రతివాదులు

To:
నెక్కలపు సీతమ్మ, D/o. నెక్కలపు మధుసూదనరావు, R/o. 1వ రోడ్డు, పుష్పలీలా నగర్, చింతలపూడి రోడ్డు, తంగెళ్ళమూడి, ఏలూరు, ఏలూరు జిల్లా.

పై నంబరు దావా గ్రంథంలో చనిపోయిన ప్రతివాది నెక్కలపు సరోజిని స్థానంలో మిమ్మల్ని వారసులుగా చేర్చమని కోరుచూ పిటీషను దాఖలు చేసినందున మీకు కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రికా ముఖంగా నోటీసు అమలుకు వాయిదా అయివున్నది. కావున వాయిదా **తేదీ 01-08-2024న ఉదయం 10.30 ని॥లకు** పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరవగలరు. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.

జి.వి.నాగేశ్వరరావు
జి.లక్ష్మయ్య
ఏలూరు న్యాయవాదులు, ఏలూరు
ది.02-7-2024 సెల్: 9440988449

దావా సమను

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, పాలకొల్లు
O.S. No. 158/2020

బిట్వీన్:
బూరాడ శ్రీనివాసరావు -వాది
Vs
కుసుమే విజయకుమారి -ప్రతివాది

To:
ప్రతివాది: కుసుమే విజయకుమారి, W/o. సుధాకర్ శ్యామ్‌బాబు, ఎల్‌టి కంప్యూటర్స్, ప్రైమరీ హెల్త్ సెంటర్, మొగల్తూరు, మొగల్తూరు మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు పై నెంబరు దావాను ది. 25-07-2024 కు వాయిదా వేసినారు. కాబట్టి ప్రతివాది పై నెంబరు దావాలో **ది. 25-07-2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కానిచో ప్రతివాది పరోక్షమందు పై నెంబరు దావాను శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు అని తెల్పడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

యమ్.వెంకట రామారెడ్డి
పాలకొల్లు అడ్వకేటు
తేది.02-7-2024 సెల్: 9440110677